సాక్షి
వికారాబాద్
శనివారం, 2, మార్చి, 2024



జాతరకు తరలివచ్చిన భక్తజనం

జై..జగజ్జననీ!

సిడెపై దర్శనమిచ్చిన పోలెపల్లి ఎల్లమ్మతల్లి

- అంగరంగ వైభవంగా వేడుక
- పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

బొంరాస్‌పేట: శివసత్తుల తల్లికి శుక్రవారం నిర్వహించిన సిరిమానోత్సవం నేత్ర పర్వంగా సాగింది. డప్పుల మోతలు.. బైండ్ల వారి జమిడీకల జెజ్జెనకలు, డోలు శబ్దాలు.. ఎల్లమ్మ మాతాకీ జై.. మావురాల తల్లీ మమ్ము కాపాడమ్మా.. పోలెపల్లి తల్లీ సల్లంగా చూడమ్మా.. అంటూ గవ్వల పసుపు బండారు చల్లుతూ హోరెత్తించారు. శివసత్తులు పూనకాలతో జాతర ప్రాంగణం ఊగిపోయింది. అంగరంగ వైభవంగా సాగిన సిడె ఉత్సవాన్ని వేలాది మంది భక్తులు తిలకించి తరించారు. తెలంగాణలోనే అతి పెద్ద గ్రామ దేవతల జాతరగా పేరుగాంచిన పోలెపల్లి రేణుకా ఎల్లమ్మ అమ్మవారి జాతర ఘనంగా సాగింది. సాయంత్రం సిడెపై అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రెండు లక్షల మందికి పైగా భక్తులు ఎల్లమ్మను దర్శించుకున్నారు. తెలంగాణ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. కోనేరులో స్నానమాచరించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కోడి పుంజుల మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆనవాయితీ ప్రకారం చుక్కబోనంతో మహిళలు తరలివచ్చి నైవేద్యం సమర్పించారు. ఎల్లమ్మను మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జయరాములు, మేనేజరు రాజేందర్‌రెడ్డి, బుగ్గప్ప, నర్సింలు, సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



మూలవిరాట్టు



సిడె వేడుక



మహిళల పూనకాలు

మరిన్ని ఫొటోలు 8లో

న్యూస్‌రీల్

థియేటర్ ఆర్ట్స్‌లో విద్యార్థినికి గోల్డ్ మెడల్

తాండూరు టౌన్: థియేటర్ ఆర్ట్స్(రంగస్థల కళల శాఖ)లో తాండూరుకు చెందిన విద్యార్థిని పూజా ఠాకూర్ గోల్డ్ మెడల్ సాధించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ 16వ స్నాతకోత్సవంలో ఆమె రాష్ట్ర గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా బంగారు పతకం, సర్టిఫికెట్ అందుకున్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కళామంచ్ ద్వారా ఆమె జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలు ప్రదర్శనలు ఇచ్చారు. ఆమెను తాండూరు శాలివాహన డిగ్రీ కళాశాల అధ్యాపకులు అభినందించారు. కళల రంగంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటానని పూజ తెలిపారు.

ధరణి సమస్యలు పరిష్కరించండి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణి పోర్టల్‌తో తలెత్తిన భూ సంబంధిత సమస్యలన్నీ పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ తెలిపారు. ప్రభుత్వ వైఖరి సాంకేతిక సమస్యలకే పరిమితం కాకుండా మూలాల నుంచి పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం లేకపోవడంతో నేరుగా ఎంఆర్‌ఓ, కలెక్టర్ల చేతుల్లోకి అధికారం కేంద్రీకరించబడటం సమస్యలు పెరగడానికి ప్రధాన కారణమైందని తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులే కాకుండా భూ సమస్యలపై కొత్త దరఖాస్తులను స్వీకరించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూ ప్రక్షాళన పేరుతో ధరణి సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొచ్చి.. పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను పెద్దలకు కట్టబెట్టిందని, వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. 1940లో భూ సర్వే జరిగిందని, ఆ తర్వాత ఇప్పటి వరకు సర్వే చేపట్టలేదన్నారు. వెంటనే సమగ్ర భూ సర్వే చేపట్టి, ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరారు.

బంగారు భవితకు ఓటే ఆయుధం



ఓటు వేస్తున్న విద్యార్థిని

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల వాతావరణం నెలకొంది. అచ్చం సార్వత్రిక ఎన్నికల మాదిరి ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు నిర్వహించిన మాక్ పోలింగ్ అందరిని అబ్బురపరిచింది. ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల అందుకు వేదికైంది. ఓటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు పాతూరి శ్రీనివాస్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. నామినేషన్ల నుంచి మొదలుకొని బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం, ఓట్ల లెక్కింపు, ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాల జారీ తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు.

పల్స్@89,903



- రేపటి నుంచి మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం
- ఐదేళ్లలోపు చిన్నారులందరికీ చుక్కల మందు
- జిల్లాలో 566 సెంటర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: పల్స్ పోలియో కార్యక్రమానికి వైద్యారోగ్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 3 నుంచి మూడు రోజుల పాటు చుక్కల మందు వేయనున్నారు. ఆదివారం ఎంపిక చేసిన కేంద్రాల వద్ద.. సోమ, మంగళవారాల్లో ఇళ్ల వద్ద పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నారు. పోలియో మహమ్మారిని పూర్తిగా నిర్మూలించేందుకు ఏటా రెండు పర్యాయాలు కార్యక్రమం నిర్వహించేవారు. వ్యాధి అదుపులోకి వచ్చిందనే కారణంతో గతేడాది కార్యక్రమం నిర్వహించలేదు. ఇటీవల మన పొరుగు దేశాల్లో మహమ్మారి విజృంభించడాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందు జాగ్రత్తగా మళ్లీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది.

అధికారుల కసరత్తు

చిన్నారులకు చుక్కల మందు వేసేందుకు జిల్లా యంత్రాంగం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో కసరత్తు చేస్తోంది. శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డి వైద్యారోగ్య శాఖ, అనుబంధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ముందు రోజే దండోరా వేయించాలని సూచించారు. ఇప్పటికే వైద్యారోగ్యశాఖ అధికారులు పల్స్ పోలియో చుక్కలు వేయాల్సిన చిన్నారులను గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 11 లక్షల పైచిలుకు జనాభా ఉండగా సున్నా నుంచి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు 89,903 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ పోలియో డ్రాప్స్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం 57 రూట్లలో 1,132 మంది అధికారులు, సిబ్బందిని నియమించారు. 566 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో మరో 25 మొబైల్ టీంలు పని చేయనున్నాయి.

నిధులు ఎలా..?

చిన్నారులకు అవసరమైన వ్యాక్సిన్‌ని కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. అయితే గతంలో పల్స్‌పోలియో కార్యక్రమ నిర్వహణకు అవసరమయ్యే డబ్బులు ముందుగానే విడుదల చేసే వారు. ఈ సారి ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. దీంతో సిబ్బంది టీఏ, డీఏలు, వ్యాక్సిన్ చేరవేత, మొబైల్ టీంల పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాల కోసం నిధులు ఎక్కడి నుంచి సమకూర్చుకోవాలో అధికారులకు స్పష్టత లేకుండా పోయింది.

విజయవంతం చేయాలి

పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ఇది ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలి. సున్నా నుంచి ఐదు సంవత్సరాలు వయస్సు ఉన్న చిన్నారులందరికీ చుక్కల మందు వేయించాలి. మూడు రోజుల పాటు కార్యక్రమం కొనసాగుతుంది.

– నారాయణరెడ్డి, కలెక్టర్



పూడూర్: హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి తదితరులు

'పాలమూరు'ను పూర్తి చేస్తాం

- బీఆర్‌ఎస్ హయాంలో జిల్లాకు తీవ్ర అన్యాయం
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: బీఆర్‌ఎస్ పాలనలో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని, పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తామని చెప్పి మాట తప్పిందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలమూరు – రంగారెడ్డి, కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టులను సందర్శించనున్నట్లు తెలిపారు. మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వేల కోట్లు దోచుకుందని ఆరోపించారు. నాసిరకంగా నిర్మాణం వల్లే నేడు నిలువునా కుంగిందని అన్నారు. కేటీఆర్ ఏం ముఖం పెట్టుకొని ప్రాజెక్టు సందర్శనకు వెళ్లారో చెప్పాలని నిలదీశారు. ఆరు గ్యారంటీల్లో నాలుగు పథకాలను అమలు చేశామని, రెండు నెలల్లో మిగిలిన పథకాలను అమలు చేసి తీరుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనే రైతులకు సాగు నీరు అందిందని గుర్తు చేశారు. తాము అనేక ప్రాజెక్టులు నిర్మించామని, ఏ ఒక్క ప్రాజెక్టులో కూడా లోపాలు లేవన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన ఒక్క ప్రాజెక్టులోనే అనేక లోపాలు బయట పడ్డాయని, ఎంత అవినీతి జరిగిందో ఊహకు కూడా అందడం లేదన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, నాయకులు పార్థసారథి, హన్మంతు ముదిరాజ్, ఎర్రగడ్డపల్లి కృష్ణ పాల్గొన్నారు.

దైవభక్తి అలవర్చుకోవాలి

పూడూర్: ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పూడూర్ మండలం ఎన్కేపల్లిలోని హనుమాన్ ఆలయంలో స్థానిక నేతలతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల మొక్కును చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దైవభక్తి ప్రతి ఒక్కరికీ ఎంతో శక్తిని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, కార్యదర్శి పెంటయ్య, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, దోమ మాజీ సర్పంచ్ మాలి రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వొద్దు

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ఇంటర్ పరీక్షల్లో కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదే శించారు. శుక్రవారం అనంతగిరిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. 318 మంది విద్యార్థులకు గాను 13 మంది గైర్హాజరయినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని, విద్యార్థులు కాపీయింగ్ పాల్పడకుండా చూడాలని ఆదేశించారు. ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

సీసీ రోడ్లను పూర్తి చేయండి

జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని ఈ నెల 15లోగా పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కూలీలను సమకూర్చుకొని సకాలంలో రోడ్డు పనులను పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు ఉపయోగపడే పనులను చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఉమేష్, శ్రీరాములు, డీఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'స్పెషల్ డ్రైవ్'కు రెడీ

- నేటి నుంచి రంగంలోకి ప్రత్యేక బృందాలు
- గ్రామాల్లో పర్యటించనున్న అధికారులు
- భూ దరఖాస్తుల పరిష్కారానికి సిద్ధం
- ఈ నెల 9వరకు పెండింగ్ అప్లికేషన్లకు మోక్షం



యాచారం తహసీల్దార్ కార్యాలయం

యాచారం: భూ దరఖాస్తుల పరిష్కారానికి ఎట్టకేలకు సర్కార్ ధరణి స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం యాచారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అయ్యప్ప అధ్యక్షతన రెవెన్యూ సిబ్బంది సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం మండలంలోని 24 గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు గుర్తించారు. మండలంలో టీఎం-4, టీఎం-3, టీఎం-22, టీఎం-15, టీఎం-26, టీఎం-14, టీఎం-32, టీఎం-33 తదితర మాడ్యూల్ కింద దాదాపు 2,529 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. అత్యధికంగా మొండిగౌరెల్లి, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, చింతుల్ల, చింతపట్ల, మాల్, నక్కర్తమేడిపల్లి, తాడిపర్తి, కుర్మిద్ద, నానక్‌నగర్ గ్రామాల్లో భూ సమస్యలున్నట్లు తేలింది. ఆయా గ్రామాల్లో అత్యధికంగా ఏళ్ల క్రితం అసైన్డ్ పట్టాలు పొంది నేటికీ రికార్డుల్లో నమోదు కాకపోవడం.. అర్హులైన రైతులకు పట్టాదారు, పాసుపుస్తకాలు జారీ కాకపోవడం.. కొన్ని గ్రామాల్లో గతంలో నకిలీ పట్టాదారు, పాసుపుస్తకాలు పొందిన వారు రెవెన్యూ సిబ్బంది సహకారంతో ధరణి పోర్టల్‌లో నమోదు చేసుకుని పట్టాదారు, పాసుపుస్తకాలు పొందారు. దీంతో నిజమైన అసైన్డ్‌దారులకు తీవ్ర అన్యాయం జరిగినట్లు గుర్తించారు. అలాంటి నకిలీ సర్టిఫికెట్లను గుర్తించి, నిజమైన రైతులకు న్యాయం చేసేలా అధికారులు కృషి చేయనున్నారు.

తిరస్కరిస్తే సమాచారం..

పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను ఈ నెల 9లోపే పూర్తిగా పరిష్కరించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నేపథ్యంలో శనివారం నుంచి గ్రామాల్లోకి రెవెన్యూ స్పెషల్ టీంలు పర్యటిస్తాయి. పెండింగ్ భూ దరఖాస్తులతో పాటు సేత్వార్, ఖస్రా, పాత పహాణి, పాత 1బీ రిజిస్టర్లు, ధరణి పోర్టల్‌లో ఉన్న భూరికార్డులను గ్రామాలకు తీసుకెళ్లి ప్రజల సమక్షంలో పరిష్కరించేలా కృషి చేస్తారు. తహసీల్దార్ అయ్యప్ప ఆధ్వర్యంలో ఒక టీం, ఉప తహసీల్దార్ కీర్తిసాగర్ ఆధ్వర్యంలో మరో టీఎం ఏర్పాటైంది. ప్రతి టీంలో ఆర్‌ఐ, జూనియర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు ఉంటారు. స్పెషల్‌డ్రైవ్ టీంలు ఈ నెల 9 వరకు గ్రామాల్లో ఉండి భూ సమస్యలను పరిష్కరిస్తాయి. ఏవైనా కారణాలతో దరఖాస్తులు తిరస్కరిస్తే ఆ ఫిర్యాదుదారుడికి కచ్చితంగా సమాచారం అందించాల్సి ఉంటుంది. దరఖాస్తులో పొందుపర్చిన ఫోన్ నంబర్‌కు ఎస్‌ఎంఎస్ పంపాల్సి ఉంటుంది. భూ సమస్యల ఆధారంగా బాధిత రైతులకు ముందే సమాచారం ఇస్తారు.

నిషేధిత భూములకు మోక్షం కలిగేనా..?

ఫార్మాసిటీ భూసేకరణలో భాగంగా రైతులు పట్టా భూములు ఫార్మాకు ఇవ్వడం లేదని తాడిపర్తి, కుర్మిద్ద, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి గ్రామాలకు చెందిన రైతుల పట్టా భూముల రికార్డులను సీసీఎల్‌ఏ అధికారులు నిషేధిత జాబితాలో పెట్టారు. ఆయా గ్రామాల్లోని దాదాపు 350 మందికి పైగా రైతులకు చెందిన 4 వేల ఎకరాల పట్టా భూములను నిషేధిత జాబితాలో ఉన్నాయి. ఆయా గ్రామాల రైతులు తమ భూముల పట్టా రికార్డులను నిషేధిత జాబితాలోంచి తీసేయాలని యాచారం తహసీల్దార్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, కలెక్టర్, సీసీఎల్‌ఏ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేశారు. రైతుల ఆందోళనలను సీరియస్‌గా తీసుకున్న అప్పటి సర్కార్ రైతుల భూముల రికార్డులను ఏకంగా అథారిటీలో పెట్టి భూ పరిహారాన్ని కోర్టులో జమ చేసింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం, స్పెషల్‌డ్రైవ్ చేపట్టిన నేపథ్యంలో నిషేధిత జాబితాలోంచి తొలగిపోయేనా అని ఫార్మా భూ బాధితులు ఎదురు చూస్తున్నారు. మరో 2,500 ఎకరాలకు పైగా భూములు భూదాన్, సీలింగ్ భూములంటూ నిషేధిత జాబితాలో పెట్టారు.

క్లుప్తంగా

వాట్సాప్‌లో అశ్లీల వీడియో
ఆర్‌ఎంపీ పై కేసు

తాండూరు టౌన్: వాట్సాప్ గ్రూప్‌లో అశ్లీల వీడియో పోస్టు చేసిన ఆర్‌ఎంపీపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం సీఐ సంతోశ్ కుమార్ తెలిపి ప్రకారం పట్టణానికి చెందిన ఆర్‌ఎంపీ అహ్మద్ ఫిబ్రవరి 21న ఓ మహిళ ఏకాతంగా ఉన్న వీడియోను వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. ఆ గ్రూప్‌లో సభ్యుడిగా ఉన్న ఎజాజ్‌పాషా శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు సెల్‌ఫోన్లు, నగదు చోరీ
నిందితుడు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ

దౌల్తాబాద్: మండల కేంద్రంలో ఓ ఇంట్లో మరియు బేకరీలో ఓ వ్యక్తి సెల్‌ఫోన్లు, నగదు దొంగిలించాడు. శుక్రవారం ఎస్‌ఐ శ్రీశైలంయాదవ్ తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నాంపల్లి నరేశ్ గురువారం రాత్రి ఓ ఇంట్లో మరియు బేకరీలో రెండు సెల్‌ఫోన్లు, రూ.6వేల నగదు ఎత్తుకెళ్లాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడి పట్టుకున్నారు. నరేశ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

రౌడీషీటర్స్ సత్ప్రవర్తన అలవర్చుకోవాలి
వికారాబాద్ సీఐ నాగరాజు

అనంతగిరి: రౌడీషీటర్స్ సత్ప్రవర్తన అలవర్చుకోవాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని వికారాబాద్ సీఐ నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం ఆయన వికారాబాద్ ఠాణా పరిధిలోని రౌడీషీటర్స్‌కు కౌన్సెలింగ్ ఏర్పాటు చేశారు. రౌడీషీట్‌లో ఉన్నవారు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా, కబ్జాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టినా చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ప్రవర్తన మార్చుకోనివారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు.

బాలుడిపై పాక్సో కేసు నమోదు

పూడూరు: ఓ బాలికపై బాలుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఓ గ్రామంలో బాలిక(12)పై అదే గ్రామానికి చెందిన బాలుడు(16) అత్యాచారానికి ఒడిగట్టాడని బాలిక కుటుంబీకులు చన్గోముల్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పాక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

8న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

తాండూరు రూరల్: మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న గౌతపూర్ గ్రామంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు శంకుతల వెల్లడించారు. శుక్రవారం గౌతపూర్‌లోని ఆమె నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే రోహి త్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో 'రోహిత్ అన్న మహిళ చేయూత' కార్యక్రమం ద్వారా 365 మంది మహిళలకు ఉచితంగా మగ్గం, టైలరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్‌లపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశ్యంతో మహిళ దినోత్సవం రోజున గౌతపూర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభిస్తున్నట్లు వివరించారు.


సిడెకు మొక్కుతున్న చిన్నారి

వైభవం.. సిరిమానోత్సవం

సిరులు కురింపిచే ఎల్లమ్మ తల్లి సిరిమానోత్సవం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం పసుపుతో బంగారు వర్ణం పులుముకుంది. భక్తజనుల జయజయ ధ్వానాలతో పరిసరాలు దద్దరిల్లాయి. సిడెపై అమ్మవారి దర్శనం కోసం వేలాది మంది గంటల కొద్ది వేచియున్నారు. రాష్ట్రంలో అతిపెద్ద గ్రామ దేవత ఉత్సవంగా పేరుగాంచిన జాతరకు పొరుగురాష్ట్రాల నుంచి భక్తులు పోటెత్తారు. - బొంరాస్‌పేట


భక్త జనసంద్రంగా ఆలయ పరిసరాలు


సూర్యశిఖర వందనం


బోనంతో ఆలయ ప్రధాన పూజారి


కుంభం వద్ద మహారాష్ట్ర భక్తులు


సిరిమానోత్సవంలో భక్తుల వందనం

మట్టిలో మాణిక్యాలు

• 'బీట్' మారింది!
డీఎల్‌గా ఎంపికైన ఎఫ్‌బీఓ నరేశ్



ధారూరు: గురుకుల విద్యాసంస్థల నియామక బోర్డు(టీఆర్‌ఈఐఆర్‌బీ) ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో ధారూర్ ఫారెస్ట్ బీట్ ఆఫీర్ (ఎఫ్‌బీఓ) సీహెచ్.నరేశ్ డీఎల్(డిగ్రీ లెక్చరర్) పోస్టుకు ఎంపికయ్యారు. ఎంఎస్‌సీ విద్యార్హత కలిగిన పరిగి మండలం రావులపల్లి వాసి నరేశ్ 2019 జూలైలో ఎఫ్‌బీఓ కొలువు సాధించాడు. ధారూరులో విధులు నిర్వహిస్తున్న ఆయన గతేడాది తెలంగాణలోని సంక్షేమ గురుకులాల్లో డిగ్రీ లెక్చరర్ పోస్టులకు నిర్వహించిన పరీక్షలకు హాజరయ్యాడు. ఫిబ్రవరి 28న వెలువడిన తుది ఫలితాల్లో ఉద్యోగ అర్హత సాధించాడు. ఈ నెల 4న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామకపత్రం అందుకోనున్నారు. బీట్ ఆఫీసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి లెక్చరర్‌గా చేరనున్నట్లు శుక్రవారం ఆయన 'సాక్షి'తో చెప్పారు. ఈ సందర్భంగా ధారూరు డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జగన్మోహన్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాజేందర్‌రెడ్డి, అటవీ సిబ్బంది నరేశ్‌ను అభినందించారు.

• గిరిజన విద్యా కుసుమం భరత్
ఏకకాలంలో నాలుగు కొలువులు



కుల్కచర్ల: కష్టేఫలి అన్నారు పెద్దలు.. కష్టపడితే సాధించలేనిది ఏదీ ఉండదని నిరూపించాడు గిరిజన విద్యాకుసుమం విస్లావత్ భరత్ కుమార్. మండల పరిధిలోని టేకులతండాకు చెందిన భరత్ తన ప్రతిభతో ఏకకాలంలో నాలుగు కొలువులు సాధించాడు. మొదట గురుకుల పాఠశాలల పీజీటీ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 71వ ర్యాంకుతో ఉద్యోగాన్ని పొందాడు. అనంతరం జూనియర్ లెక్చరర్ ఫలితాల్లోనూ ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. గురుకులం టీజీటీ ఫలితాల్లో బయోసైన్స్, జనరల్‌సైన్స్ విభాగంలో కొలువుకు ఎంపికైగురు, శుక్రవారం నిర్వహించిన సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నాడు. ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు ఎంపికవ్వడంతో మండల వాసుల మన్ననలు పొందుతున్నాడు. మారుమూల గిరిజన ప్రాంతానికి చెందిన యువకుడు తన ప్రతిభతో మట్టిలోనే మాణిక్యాలుంటాయని మరోసారి నిరూపించాడని ప్రశంసిస్తున్నారు.

జేబు దొంగలకు రిమాండ్

తాండూరు టౌన్: ప్రయాణికుల జేబులు కొడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపిన ప్రకారం ఫిబ్రవరి 16న తాండూరు బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికుడు నారా నాగప్ప జేబులో నుంచి రూ.49వేల నగదు కొట్టేశారు. ఈ కేసు విచారణ చేస్తుండగా శుక్రవారం బస్టాండ్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లాకు చెందిన చంద్రయ్య, భద్రయ్య అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా రూ.49వేలు చోరీ చేసినట్లు ఒప్పుకొన్నారు. నిందితుల వద్ద రూ.18 వేల నగదు స్వాధీనం చేసుకుని ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితులను పట్టుకున్న కానిస్టేబుళ్లు అహ్మద్, శివ, షబీల్, సాయప్పలను డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి, సీఐ సంతోశ్ కుమార్, ఎస్‌ఐ కాశీనాథ్ అభినందించారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

కాంగ్రెస్‌లో గ్రూపుల లొల్లి
తట్టెపల్లిలో పరస్పరం దాడులు

పెద్దేముల్: మండలంలోని తట్టెపల్లి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తల మధ్య గ్రూపు తగాదాలు బయటపడ్డాయి. శుక్రవారం గ్రామంలో అభివృద్ధి పనులపై చర్చ జరుగుతుండగా లొల్లి చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో పంచాయితీ పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. తట్టెపల్లి పంచాయతీకి ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. దీంతో ఆ పనులను ఎవరు చేయాలనే విషయంలో గ్రామ నాయకులు సమావేశమయ్యారు. అక్కడ చర్చలు ముదిరి గొడవకు దారి తీసింది. గ్రూపులుగా ఏర్పడి దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో సాబెర్‌కు గాయాలయ్యాయి. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి
పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి


మైలారం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే టీఆర్‌ఆర్ తదితరులు

దోమ: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని మైలారం వేంకటేశ్వర స్వామి ఆలయంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హన్మంత్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా రామ్మోహన్‌రెడ్డి గెలిస్తే స్వామి వారికి 101 కొబ్బరికాయలు కొట్టి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తానని మొక్కుకుని తీర్చుకున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారన్నాడు. కొడంగల్ నియోజకవర్గాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఎలా అభివృద్ధి చేస్తున్నారో పరిగి ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే టీఆర్‌ఆర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, కుల్కచర్ల, దోమ మండలాల అధ్యక్షుడు ఆంజనేయులు, విజయ్‌కుమార్‌రెడ్డి, మైలారం మాజీ సర్పంచ్ రాజునాయక్, ఎంపీటీసీ సభ్యులు రాములు, బోయిని సురేందర్, పాలాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కలప తరలిస్తున్న లారీ సీజ్

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా కలపను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామశివారులో 29న అర్ధరాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కొర్ర హన్మంతు కలప తరలిస్తున్న లారీ ఎదురయింది. ఎటువంటి అనుమతి లేకపోవడంతో పోలీసులు లారీని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి హన్మంత్‌పై కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.


పోలీసులు సీజ్ చేసిన లారీ

ఆటలకు చోటేది!

పోటీలకు మైదానం కరువు
- అటకెక్కిన మినీ స్టేడియం
- స్థలం లేక నిర్మాణంలో జాప్యం
- రూ.16.5 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం


పాఠశాల ఆవరణలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

కొడంగల్: నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్‌లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించడానికి మైదానం కరువైంది. సరైన ఆట స్థలం లేక ఔత్సాహికులు క్రీడల్లో రాణించలేకపోతున్నారు. ఆటలు ఆడుకునేందుకు కనీస మౌలిక సదుపాయాలు లేవు. కొడంగల్‌కు ఆరేళ్ల క్రితం మంజూరైన మినీ స్టేడియం నిర్మాణం అటకెక్కింది. స్టేడియం నిర్మాణానికి స్థలం లేకపోవడం వల్ల జాప్యం జరుగుతోంది. రూ.2.25 కోట్లు మంజూరైనా మినీ స్టేడియం నిర్మాణాన్ని అధికారులు పట్టించుకోలేదు. కనీస సదుపాయాలు లేక విద్యార్థులు పాఠశాల ఆవరణలో క్రీడా శిక్షణ పొందుతున్నారు.

ఐదెకరాల స్థలం ఉంటేనే..

మొదట్లో కొడంగల్ జూనియర్ కళాశాల ఆవరణలో మినీ స్టేడియం నిర్మించాలనుకున్నారు. అక్కడ వీలు కాకపోవడంతో సిద్దనొంపు సమీపంలో స్థల పరిశీలన చేశారు. అక్కడ మినీస్టేడియం నిర్మిస్తే విద్యార్థులకు అనుకూలంగా ఉండదని ఆ ప్రయత్నం విరమించుకున్నారు. మూడోసారి బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో మినీ స్టేడియం నిర్మించడానికి స్థలం కోసం భూ సర్వే చేప్పారు. మినీ స్టేడియం నిర్మాణానికి ఐదెకరాల స్థలం అవసరముండగా ఇక్కడ కేవలం 4.5ఎకరాల ప్రభుత్వ స్థలమే ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఐదెకరాల స్థలం ఉంటేనే పనులు ప్రారంభిస్తామని ఇంజనీరింగ్ అధికారులు చెప్పడంతో నిర్మాణం తాత్కాలికంగా వాయిదా పడింది. స్టేడియం లేకపోవడం వల్ల పాఠశాల మైదానంలోనే క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, షాట్‌పుట్, రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్ ప్రాక్టీస్ చేస్తున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. పేద విద్యార్థుల ఉన్నతి కోసం మెరుగైన అవకాశాలు కల్పించాలని క్రీడాకారులు కోరుతున్నారు.


కడా అధికారికి ప్రతిపాదనలు ఇస్తున్న గురునాథ్‌రెడ్డి (ఫైల్)

రూ.16.5 కోట్లతో ప్రతిపాదనలు

కొడంగల్ మున్సిపల్ పరిధిలో రూ.16.5 కోట్లతో క్రీడాభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నెల క్రితమే మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి అభివృద్ధి ప్రణాళికలను కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి అందజేశారు. క్రీడా ప్రాంగణం అభివృద్ధికి రూ.2 కోట్లు, ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.5 కోట్లు, స్టేడియం అభివృద్ధి మరియు స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్‌కు రూ.9.50 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రాతిపాదనలు పంపించారు. త్వరలో నిధులు మంజూరు అయితే పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

సేంద్రియ సేద్యమే మేలు
రాజేంద్రనగర్ రైతు శిక్షణా కేంద్రం సహాయ సంచాలకులు దివ్యజ్యోతి, రేష్మారాజ్



రైతులకు అవగాహన కల్పిస్తున్న సహాయ సంచాలకులు

మొయినాబాద్: రైతులు రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి మళ్లించాలని రాజేంద్రనగర్ రైతు శిక్షణా కేంద్రం సహాయ సంచాలకులు దివ్యజ్యోతి, రేష్మారాజ్ సూచించారు. మొయినాబాద్‌లోని రైతు వేదికలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి రాగమ్మ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటంతో ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు రసాయనాలను తగ్గించాలన్నారు. సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టి జీవన ఎరువులు, జీవ రసాయనాలు, వర్మీ కంపోస్టు ఎరువులను వాడి అధిక దిగుబడులు సాధించాలన్నారు. వీటితో మనుషులు, భూమి ఆరోగ్యంగా ఉండటంతోపాటు ప్రకృతిని కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సునీల్, కుమార్, రైతులు పాల్గొన్నారు.

విధులకు వెళ్తూ.. వైద్యుడి మృతి

షాద్‌నగర్‌రూరల్: విధులకు వెళ్తున్న వైద్యుడు అకస్మాత్తుగా మృతి చెందిన సంఘటన శుక్రవారం పట్టణంలోని నాగులపల్లి రోడ్డుపై చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌లోని వెస్ట్‌మారేడ్‌పల్లిలో నివాసం ఉంటున్న జాన్‌పెజర్(50) చటాన్‌పల్లిలో క్రిష్టియన్ సంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న అమెరికన్ ఆస్పత్రిలో డాక్టర్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం విధులకు వెళ్లే క్రమంలో షాద్‌నగర్ బస్టాండ్‌కు వచ్చిన జాన్‌పెజర్ టిఫిన్ చేసేందుకు నాగులపల్లి రోడ్డు కు వచ్చాడు. నడుచుకుంటూ వెళుతున్న ఆయన అకస్మాత్తుగా కిందపడి మృతి చెందారు. ఏఎస్‌ఐ రాంచందర్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గుండెపోటుతోనే జాన్‌పెజర్‌కు మృతి చెందాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య హవేలీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు

ధారూరు: అనారోగ్యం కారణంగా నాలుగు రోజు క్రితం హాస్టల్ నుంచి ఇంటికి వచ్చిన బాలిక అదృశ్యమైంది. నారాయణపేట్ జిల్లా గుండుమాల్ మండల కేంద్రానికి చెందిన 17 ఏళ్ల బాలిక ధారూరు కేజీబీవీలో 9వ తరగతి చదువుతోంది. కడుపునొప్పి కారణంగా ఫిబ్రవరి 10న ఇంటికెళ్లింది. నాలుగు రోజుల తర్వాత బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో ఆమె తల్లి వికారాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చెరువు కబ్జాపై ఫిర్యాదు

శంకర్‌పల్లి: మండలంలోని మిర్జాగూడలో పెద్ద చెరువు కబ్జాకు గురి కావడంతో గురువారం ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మిర్జాగూడ–జనవాడ గ్రామాల మధ్యలో ఉన్న పెద్ద చెరువును కబ్జా చేశారని స్థానికులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు చెరువును పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోకిల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'డ్రంక్ అండ్ డ్రైవ్'లో ముగ్గురికి జైలు


శిక్ష పడిన వ్యక్తులు

తాండూరు టౌన్: మద్యం సేవించి వాహనం నడుపుతున్న ముగ్గురు వ్యక్తులకు జైలు శిక్ష విధించారు. పట్టణ సీఐ సంతోశ్ కుమార్ తెలిపిన ప్రకారం.. గొల్లచెరువు ప్రాంతానికి చెందిన నరేందర్, నరేశ్, ఇందిరానగర్‌కు చెదిన ఊషప్ప డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. శుక్రవారం తాండూరు సెకండ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నామాల అశోక్ ఒక్కొక్కరికి రూ.వేయి చొప్పున జరిమానా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి
ఐదుగురి అరెస్టు, రూ.34వేల నగదు స్వాధీనం

మొయినాబాద్: పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి, రూ.34 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎం.మహేందర్ యాదవ్, కె.నగేష్, బి.మల్లేష్, మాజీ ఉపసర్పంచ్ శ్యామ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రాజు గ్రామ శివారులోని గండిపేట చెరువు పక్కన పేకాట ఆడుతున్నారు. పక్కా సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐ దు మందిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.34,330 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని మొయినాబాద్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.